సాక్షి కర్నూలు

గురువారం । 14 । సెప్టెంబర్ । 2023



సాక్షిగణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోక కల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయప్రాంగణంలోని జ్వాలా వీరభద్ర స్వామికి విశేషపూజలు నిర్వహించారు.



శనగ విత్తనాలు సిద్ధం

ముందస్తు రబీకి అవసరమైన శనగ విత్తనాలను సిద్ధంగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీసీడ్స్) మేనేజింగ్ డైరెక్టర్ జి.శేఖర్ బాబు తెలిపారు.

8లో▸



ఏసీబీకి చిక్కిన వీఆర్వో

జలకనూరు వీఆర్వో వెంకటరమణారెడ్డి ఏసీబీ వలలో చిక్కుకున్నారు. పొలాన్ని ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు రూ. 7 వేలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.

8లో▸

న్యూస్‌రీల్

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- డీఆర్వోగా బాధ్యతలు చేపట్టిన కె.మధుసూదన్‌రావు



బాధ్యతలు స్వీకరిస్తున్న కె.మధుసూదన్‌రావు

కర్నూలు(సెంట్రల్): రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన తొలి ప్రాధాన్యత ఉంటుందని డీఆర్వో కె.మధుసూదన్‌రావు తెలిపారు. బుధవారం నూతన డీఆర్వోగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అంతకముందు కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్యను మర్యాద పూర్వకంగా వారి వారి కార్యాలయాల్లో కలసి పూల బొకేలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. డీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన కె.మధుసూదన్‌రావును ఏఓ శ్రీనాథ్ ఆధ్వర్యంలోని వివిధ సెక్షన్ల సిబ్బంది కలసి శుభకాంక్షలు తెలిపారు.

పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి రేపు కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో డిప్లమా ఇన్ పారామెడికల్ కోర్సుల్లో (2023–2024 సంవత్సరానికి గాను) ప్రవేశానికి మూడో విడత కౌన్సెలింగ్ శుక్రవారం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి కళాశాలలోని నూతన ఆడిటోరియంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు వారి విద్యార్హత ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

96,973 ఎకరాల్లో మిర్చి సాగు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 96,973 ఎకరాల్లో మిర్చి సాగైంది. సాధారణ సాగు 49,660 ఎకరాలు ఉండగా గతేడాది 1.27 లక్షల ఎకరాల్లో సాగైంది. 2022–23లో ఎండుమిర్చికి బీమా పరిహారం రాలేదు. అయితే దిగుబడి ఎక్కువగా ఉండే అవకాశం ఉండటం, ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు మిర్చి సాగుపై ఆసక్తి చూపారు. ఈ ఏడాది 1.50 లక్షల ఎకరాల వరకు సాగయ్యే అవకాశం ఉంది. ఈ క్రాప్ బుకింగ్ ప్రకారం అత్యధికంగా ఆదోనిలో 10,469, కౌతాళంలో 9,266, హొళగొందలో 9,079, పెద్దకడుబూరులో 8,354 ఎకరాల్లో సాగైంది.

చురుగ్గా కొత్త పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్):జిల్లాలో సెప్టెంబరు నెలకు సంబంధించి వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద కొత్త పింఛన్ల పంపిణీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చురుగ్గా సాగుతోంది. కొత్త పింఛన్ల మంజూరుతో ఉమ్మడి జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య 4,71,561కి చేరింది. సెప్టెంబరు నెలలో కర్నూలు జిల్లాలో పింఛన్ లబ్ధిదారులు 2,47,693 మంది ఉండగా..బుధవారం సాయంత్రం 6గంటల సమయానికి 2,43,072 (98.13 శాతం) మంది కి,నంద్యాల జిల్లాలో 2,23,868 మంది ఉండగా 2,20,443 (98.47శాతం)మందికి పంపిణీ చేశారు. కర్నూలు నగరపాలక సంస్థలోని 48 వార్డు సచివాలయం పరిధిలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి 11 మందికి కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీకి ఈ నెల 14తేదీ ఒక్క రోజు మాత్రమే మిగిలి ఉంది. ఇంత వరకు పింఛన్లు పొందని వారి గురువారం వార్డు, గ్రామ వలంటీర్లను సంప్రదించి పొందవచ్చని డీఆర్‌డీఏ–వైకేపీ పీడీ నాగశివలీల తెలిపారు.

పరీక్షించి.. స్వచ్ఛత పాలించి!

ఉమ్మడి జిల్లాలో ఏడు నీటి పరీక్ష ల్యాబ్‌లు

- 13 రకాల నీటి పరీక్షల నిర్వహణ
- రసాయనాలు, కలుషితాల గుర్తింపు
- ఆర్‌ఓ ప్లాంట్ల నుంచి పల్లె ప్రజలకు సురక్షిత నీరు
- వైఎస్సార్ సుజల ద్వారా 253 జనవాసాలకు పంపిణీ

కర్నూలు(అర్బన్): గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షితమైన నీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. నీటి పథకాల ద్వారా సరఫరా చేస్తున్న నీటిని ఏడాదికి రెండు పర్యాయాలు ల్యాబ్‌ల్లో పరీక్షించి హానికరమైన పదార్థాలు ఉన్నట్లయితే స్వచ్ఛమైన నీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందుకు సంబంధించి ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలోని ఏడు ప్రయోగశాలలు నిరంతరాయంగా పనిచేస్తున్నాయి. వీటిలో నిత్యం తాగే నీటిలో ఉన్న నైట్రేట్, ఫ్లోరైడ్, సల్ఫేట్, కాల్షియం, ఐరన్ తదితర వాటి శాతాన్ని గుర్తిస్తున్నారు. వివిధ రకాల రసాయనాల వల్ల తాగునీరు కలుషితం కావడం వల్ల ప్రజలు పలు రోగాల బారిన పడే అవకాశాలను తెలియజేసేందుకు ఈ పరీక్షలను కొనసాగిస్తున్నారు. గతంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఫ్లోరైడ్ ప్రస్తుతం తగ్గిపోయింది. గతంలో ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్ల కీళ్ల సమస్య, కాళ్లు వంకర పోవడం, పళ్ల రంగు మారడం వంటి సమస్యలతో అనేక మంది ప్రజలు ఇబ్బంది పడ్డారు. తాగునీటిలో రసాయనాలు తగు మోతాదులో లేని పక్షంలో అనేక రకాల వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నందున నీటి పరీక్షలకు ప్రాధాన్యత పెరిగింది.

13 రకాల పరీక్షలు

ఉమ్మడి జిల్లాలోని కర్నూలు, ఆదోని, ఆలూరు, నంద్యాల, ఆత్మకూరు, డోన్, బనగానపల్లె ప్రాంతాల్లోని ప్రయోగశాలలకు వివిధ ప్రాంతాల నుంచి తీసుకు వచ్చే శాంపిల్స్ నీటిలో 13 రకాల పరీక్షలను నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా టీడీఎస్, నీటి కాఠిన్యత(టోటల్ హార్డ్‌నెస్), కాల్షియం, క్లోరైడ్ నీటిలో మిగిలి ఉన్న క్లోరిన్, సల్ఫేట్, నైట్రేట్, ఐరన్ తదితర పరీక్షలను చేపడుతున్నారు.

253 జనవాసాలకు రక్షిత నీరు

ఓ వైపు నీటి పరీక్షలు నిర్వహించి రక్షిత మంచి నీటిని ప్రజలకు అందిస్తూనే, మరో వైపు వైఎస్సార్ సుజల మదర్ ప్లాంట్ ఆధ్వర్యంలో 253 జనవాసాలకు సురక్షితమైన నీటిని సరఫరా చేస్తున్నారు. రూ.25.38 కోట్లతో కోడుమూరు, వెల్దుర్తి, కృష్ణగిరి, తుగ్గలి, కౌతాళం, నందవరం, నందికొట్కూరు, కొలిమిగుండ్ల ప్రాంతాల్లో వైఎస్సార్ సుజల ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్ల నుంచి 4,09,178 మందికి ఒక్కొక్కరికి రోజుకు 40 లీటర్ల ప్రకారం ప్రతి రోజు 1,63,67,120 లీటర్ల నీటిని అందిస్తున్నారు. ఇవికాకుండా 267 ఆర్‌ఓ ప్లాంట్ల ద్వారా కూడా సురక్షితమైన నీటిని గ్రామీణ ప్రజలకు అందిస్తున్నారు.

నీటిలోని ఎక్కువగా ఉండే రసాయనాలతో వచ్చే వ్యాధులు..

సీసం: పిల్లల శారీరక, మానసిక పెరుగుదలకు ఆటంకం కలిగిస్తుంది. రక్తహీనతకు కారణమవుతుంది. మూత్ర పిండాలను దెబ్బతీస్తుంది.

నైట్రేట్ : శిశువుల్లో బ్లూబేబీ సిండ్రోమ్‌కు కారణమవుతుంది.

పురుగుమందులు: నాడీ వ్యవస్థ, పునరుత్పత్తి వ్యవస్థకు నష్టాన్ని కలిగిస్తాయి. రోగ నిరోధక శక్తిని తీవ్రంగా దెబ్బ తీస్తాయి.

కాల్షియం: మలబద్ధకం, మూత్ర పిండాల్లో రాళ్లకు కారణమవుతాయి.

ఫ్లోరైడ్: రంగు పాలిపోవడం, పళ్లు దెబ్బతింటాయి

సోడియం: ఎక్కువ నష్టం కలిగిస్తుంది.

మెగ్నీషియం కలిసిన సల్ఫేట్: అతిసారం వస్తుంది.

కేడియం : ఎముకలపై ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తుంది.

అర్సెనిక్ : చర్మవ్యాధులు, క్యాన్సర్‌కు కారణమవుతుంది.

ఫ్లోరైడ్, ఫ్లోరోసిస్ : ఎముకల్లో వైకల్యాలు, కీళ్లలో సమస్యను కలిగిస్తుంది.

☛ కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామంలోని ప్రజలకు బోరు నుంచి సరఫరా అవుతున్న నీటిని ల్యాబ్‌లో పరీక్షించగా హార్డ్ నెస్ ఎక్కువగా ఉన్నట్లు రిపోర్టు వచ్చింది. దీంతో సదరు బోరు నీటిని తాగేందుకు ఉపయోగించకుండా, రక్షిత మంచి నీటి పథకం నీటితో పాటు ఆర్‌ఓ ప్లాంట్ నుంచి సురక్షితమైన నీటిని ప్రజలకు అందిస్తున్నారు.

☛ కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలోని ప్రజలకు ఏడు సోర్సుల ద్వారా నీరు సరఫరా అవుతోంది. ఈ నీటిని పరీక్షించగా, మూడింట్లో ఫ్లోరైడ్ ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఈ మూడు సోర్సుల నీటిని తాగేందుకు ఉపయోగించకుండా ఇతర సోర్సుల నీటిని తాగేందుకు సరఫరా చేస్తున్నారు.



కర్నూలు ల్యాబ్‌లో నీటి పరీక్షలను నిర్వహిస్తున్న సిబ్బంది



పగిద్యాలలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్

గ్రామీణ ప్రజలకు అందుతున్న నీటి వివరాలు

జిల్లా గ్రామ పంచాయతీలు:	484
జనావాసాలు:	721
గ్రామీణ జనాభా:	16,28,736
రోజుకు ఒక వ్యక్తికి అందిస్తున్న రక్షిత మంచినీరు:	55 లీటర్లు
జిల్లాలోని నీటి వనరులు: తుంగభద్ర, జీడీపీ, కేసీ కెనాల్, హెచ్ఎన్ఎస్ఎస్	
సీపీడబ్ల్యూఎస్‌లు:	32
పీడబ్ల్యూఎస్‌లు:	371
ఎంపీడబ్ల్యూఎస్‌లు:	445
డైరెక్ట్ పంపింగ్:	97

1,487 జనావాసాలకు సురక్షిత నీరు



ఉమ్మడి జిల్లాలోని 1,487 జనవాసాలకు సురక్షితమైన నీటిని అందిస్తున్నాం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు రక్షిత మంచి నీటిని అందించేందుకు నీటి పరీక్షలకు ప్రాధాన్య త ఇస్తున్నాం. పరీక్షల్లో రసాయనాలు, కలుషితాలు గుర్తించి అవసరమైన చర్యలను చేపడుతున్నాం. కర్నూలులో నిర్వహిస్తున్న ల్యాబ్‌కు నేషనల్ అక్రిడేటెడ్ బోర్డు ల్యాబొరెటరీస్‌గా గుర్తింపు వచ్చింది. ఇక్కడ అత్యంత నాణ్యతా ప్రమాణాలతో నీటిని పరీక్షిస్తున్నాం.

– బి.నాగేశ్వరరావు, ఎస్‌ఈ, ఆర్‌డబ్ల్యూఎస్

19న డోన్‌కు సీఎం వైఎస్ జగన్ రాక

- లక్కసాగరంలో పంప్ హౌస్ ప్రారంభం
- డోన్‌లో బహిరంగ సభ



నంద్యాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 19వ తేదీ డోన్ పట్టణానికి రానున్నట్లు నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తెలిపారు. హంద్రీ–నీవా నీటితో 74 చెరువులను నీటిని నింపే పంప్ హౌస్‌ను కృష్ణగిరి మండలం లక్కసాగరం వద్ద ప్రారంభిస్తారని, అనంతరం డోన్ పట్టణంలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారని పేర్కొన్నారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ పుల్లయ్యలతో కలిసి కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రొటోకాల్ ప్రకారం అప్పగించిన పనులు సమర్థవంతగా నిర్వర్తించాలని అధికారులకు ఆదేశించారు. హెలిప్యాడ్ నుంచి బహిరంగ సభ వేదిక వరకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అంతరాయం లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన జనరేటర్లను సిద్ధంగా ఉంచుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ అధికారులకు ఆదేశించారు. బహిరంగ సభకు సమీప ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సేఫ్ గదుల్లో అత్యవసర మందులతో పాటు నిపుణులైన డాక్టర్లను సిద్ధంగా ఉంచాలన్నారు. గ్రీన్ రూమ్, సభా వేదిక, విజిటర్స్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆహార పదార్థాల్లో కల్తీ లేకుండా జాగ్రత్తగా చెక్ చేయాలన్నారు. సభా వేదిక ప్రాంతంలో తాగునీటి వసతి, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని డోన్ మున్సిపల్ కమిషనర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

కొత్తపల్లి: అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ బీఎస్ఎస్ మూర్తి అన్నారు. బుధవారం ఆత్మకూరు రేంజ్‌లోని కొత్తపల్లి మండలం ముసలిమడుగు ఫారెస్ట్ సెక్షన్ పరిధిలో ఉన్న చీమలతిప్ప, దోవకుంట బేస్ క్యాంపులను, ఫారెస్టును డీడీపీటీ అలెన్ చాంగ్ టెరాన్ తో కలసి తనిఖీ చేశారు. ముందుగా బేస్ క్యాంపులో పని చేస్తున్న సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధుల నిర్వహణలో సిబ్బంది బాధ్యతాయుతంగా నడుకోవాలన్నారు. అడవుల్లో ఉన్న ప్రతి మొక్కను రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే జంతువులకు హాని జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కృష్ణానదిలో మరబోటుపై విహరించి నది పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ అధికారి పట్టాభి, యాంటీ పోచింగ్ స్క్వాడ్ సుభాష్, ఎఫ్ఆర్వో స్క్వాడ్ శ్రీకాంత్, ఎఫ్ఎస్ఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బోటుపై విహరిస్తూ నదీ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న అటవీశాఖాధికారులు

ఉపాధ్యాయులకు ‘ప్రొఫెషనల్’ పరీక్ష

కర్నూలు కల్చరల్: జిల్లాలో ఎస్‌జీటీ, ఈజీటీ కేడర్‌లోని అర్హులైన ఉపాధ్యాయులకు ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు డీఈవో వెంకటరంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఇన్‌స్పెక్టర్ గ్రేడ్–2 పండిట్‌లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, క్రాఫ్ట్ డ్రాయింగ్ టైలరింగ్‌లో స్పెషల్ టీచర్లకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ పరీక్ష గ్రేడ్–1, పండిట్‌లకు సింపుల్ ఓరియంటేషన్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష ఫీజు చెల్లింపును ఈనెల 16వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. www. bse. ap. gov వెబ్‌సైట్ ద్వారా రూ.260 ఫీజును చెల్లించాలని తెలిపారు.

జిల్లాలో 456 జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు



ఆరోగ్యశ్రీ సేవలు ఎలా పొందాలో తెలిపే బ్రోచర్ విడుదల చేస్తున్న కలెక్టర్, జిల్లా అధికారులు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో 456 జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, వైద్యాధికారులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య సురక్ష క్యాంపులను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 15 నుంచి ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని, 16 నుంచి ఏఎన్ఎంలు, వలంటీర్లు కలసి ఇంటంటికీ వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారి డేటాను సేకరించాలన్నారు. ఈ నెల 30 నుంచి ఆరోగ్య క్యాంపులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు జిల్లా నుంచి జిల్లా కలెక్టర్‌తోపాటు జిల్లా వైద్యాధికారి డాక్టర్ రామగిడ్డయ్య, డీఆర్వో కె.మధుసూదన్‌రావు, ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ, డీపీఓ నాగరాజునాయుడు పాల్గొన్నారు. సమీక్ష అనంతరం డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్యం పొందడం ఎలా అంశంపై ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు రూపొందించిన బ్రోచర్‌ను అధికారులు విడుదల చేశారు.

తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించాలి

తప్పుల్లేని ఓటరు జాబితా రూపకల్పన చేయాలని ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలను కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆమె స్పెషల్ సమ్మరీ రివిజన్–2024పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..త్వరలోనే ముసాయిదా ఓటరు జాబితా విడుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. సెప్టెంబర్ 15లోపు పెండింగ్‌లో ఉన్న అన్ని ఫారాలను తగిన ధ్రువపత్రాలతో డిస్పోజ్ చేయాలన్నారు. వంద శాతం పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి హేతుబద్ధీకరణ చేయాలన్నారు. తప్పుల్లేని ఓటరు జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.

14వ రోజు 443 మంది ఎంపిక

కర్నూలు : స్థానిక ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో ఎస్ఐ అభ్యర్థులకు 14వ రోజు బుధవారం దేహదారుఢ్య పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలను కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్, కర్నూలు, అన్నమయ్య జిల్లాల ఎస్పీలు కృష్ణకాంత్, కృష్ణారావు, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ పర్యవేక్షించారు. బుధవారం 800 మందిని ఆహ్వానించగా 623 మంది హాజరయ్యారు. వీరి సర్టిఫికెట్లను పరిశీలించి బయోమెట్రిక్, ఎత్తు, ఛాతీ కొలతను నిర్వహించారు. అనంతరం వారందరికీ శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహించగా 1600 మీటర్ల పరుగులో 511, 100 మీటర్ల పరుగులో 388 మంది, లాంగ్‌జంప్‌లో 422 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం అన్ని ఈవెంట్లలోనూ 443 మంది అర్హత సాధించి ఎస్ఐ తుది రాత పరీక్ష (మెయిన్స్)కు ఎంపికయ్యారు.

వాయిదా పడిన దేహదారుఢ్య పరీక్షలు నేటి నుంచి

రాయలసీమ జోన్‌కు సంబంధించి ఎస్ఐ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలు ఏపీఎస్పీ రెండవ పటాలంలో ఆగస్టు 25వ తేదీ నుంచి దేహదారుఢ్య పరీక్షలు జరుగుతున్నాయి. భారీ వర్షం కారణంగా సెప్టెంబర్ 4, 5వ తేదీ జరగాల్సిన దేహదారుఢ్య పరీక్షలను ఈనెల 21, 22వ తేదీకి వాయిదా వేసిన విషయం అందరికీ తెలిసిందే. అయితే నేటి (సెప్టెంబర్ 14) నుంచి ఈనెల 22వ తేదీ లోపు ఎప్పుడైనా కానీ ఆయా తేదీల్లో కేటాయించిన అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షలకు హాజరుకావచ్చని కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.



దేహదారుఢ్య పరీక్షలకు హాజరైన ఎస్ఐ అభ్యర్థులు

పక్కాగా పంటల నమోదు

- ఈ క్రాప్ బుకింగ్‌లో కర్నూలు జిల్లా ప్రథమస్థానం
- జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 10,42,537 ఎకరాలు
- 8,10,887 ఎకరాలలో పంటల సాగు పూర్తి
- ఈ క్రాప్‌లో 6,57,011 ఎకరాల్లో పంటల నమోదు
- ఈ నెల చివరిలోగా పంటల నమోదు ప్రక్రియ పూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియలో కర్నూలు జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 10,42,537 ఎకరాలు ఉండగా... ఇప్పటి వరకు 8,10,887 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో 6,57,011 ఎకరాల్లో పంటల నమోదు పూర్తయ్యింది. ఈ నెల 20లోగా 80 శాతం, 25వ తేదీలోగా 100 శాతం నమోదు పూర్తి చేయాలనే లక్ష్యాన్ని వ్యవసాయాధికారులు నిర్ణయించుకున్నారు. ఇప్పటికే 81.02 శాతం పూర్తయ్యింది. జిల్లాలో 466 రైతుభరోసా కేంద్రాలు ఉండగా.. అన్నింటిలో ఈ–క్రాప్ బుకింగ్ ముమ్మరంగా జరుగుతోంది.

ఎమ్మిగనూరు సబ్ డివిజన్ ముందంజ

పంటల నమోదులో ఎమ్మిగనూరు సబ్ డివిజన్ ముందంజలో ఉంది. ఈ సబ్ డివిజన్‌లో ఎమ్మిగనూరు, నందవరం, మంత్రాలయం, గోనెగండ్ల మండలాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 1,39,252 ఎకరాల్లో పంటలు సాగు కాగా 1,34,797 ఎకరాల్లో పంటలను నమోదు చేశారు. అంటే 96.80 శాతం పంటల నమోదు పూర్తి అయింది. కర్నూలు సబ్ డివిజన్‌లో 77.97 శాతం, ఆదోని సబ్ డివిజన్‌లో 72.99 శాతం, ఆలూరు సబ్ డివిజన్‌లో 90.11 శాతం, పత్తికొండ సబ్ డివిజన్‌లో 75.01 శాతం ప్రకారం పంటల నమోదు పూర్తయ్యింది.

వంద శాతం పారదర్శకత

పంటల నమోదులో 100 శాతం పారదర్శకత ఉండేందుకు ఈ సారి జియో ఫెన్సింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. పంటల నమోదు సందర్భంగా తీసిన ఫొటోలను అక్షాంశం, రేఖాంశం ద్వారా విశ్లేషిస్తారు. గత ఏడాది కొందరు ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లు.. రైతుల పొలంలోకి వెళ్లకుండానే నమోదు ప్రక్రియ చేపట్టినట్లు సూపర్ చెక్‌లో వెలుగుచూసింది. దీనిని నివారించేందుకు జియో ఫెన్సింగ్‌తో ఫొటోలు తీస్తున్నారు. ఎటువంటి సవరణ(ఎడిట్) ఆప్షన్ లేకపోవడంతో క్షేత్రస్థాయి అధికారులు నమోదు చేసిన వివరాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతనే అప్‌లోడ్ చేస్తున్నారు.



పంట నమోదు చేసున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

చురుగ్గా బయోమెట్రిక్ ధ్రువీకరణ

పంటల నమోదులో రైతుభరోసా కేంద్రాల ఇన్‌చార్జీలే కీలకం. ఆర్‌బీకే ఇన్‌చార్జీలు పంటలను నమోదు చేయడంతో పాటు బయోమెట్రిక్ అథెంటికేషన్ ద్వారా ధ్రువీకరించాలి. ఆ తర్వాత వీఆర్వో లాగిన్‌కు సమాచారం వెళ్తుంది. వీఆర్వో కూడా ఖాతా నంబరు, సర్వే నంబరు తనిఖీ చేసి బయోమెట్రిక్ వేయడం ద్వారా ధ్రువీకరించాలి. ప్రస్తుతం ఒకవైపు పంటల నమోదు, మరోవైపు వీఏఏ, ఇంకోవైపు వీఆర్వోల అథెంటికేషన్, రైతులతో ఈ–కేవైసీ చేయించడం చురుగ్గా జరుగుతోంది. జిల్లాలో వీఏఏ అథెంటికేషన్ 78.89 శాతం, వీఆర్వో అథెంటికేషన్ 62.4 శాతం, రైతుల ఈ–కేవైసీ 12.61 శాతం పూర్తి అయింది. ఇప్పటి వరకు 13,414 మంది రైతులు 40,815 ఎకరాల్లో సాగు చేసిన పంటలను ఈ–కేవైసీ ద్వారా ధ్రువీకరించారు. పంటల నమోదు వంద శాతం పక్కాగా జరిగిందా అనే దానిపై ఏవో, తహసీల్దారు, ఏడీఏ, ఆర్‌డీవోలు, జిల్లా వ్యవసాయ అధికారి, జేసీ, కలెక్టర్లు సూపర్ చెక్ నిర్వహిస్తారు. ఈ–క్రాప్‌లో నమోదు చేసిన వివరాలు, క్షేత్రస్థాయిలో అన్ని సక్రమంగా ఉన్నాయనే దానిని సూపర్ చెక్ ద్వారా ధ్రువీకరిస్తారు.

పొరపాట్లు లేకుండా చర్యలు



వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో పొరపాట్లకు తావులేకుండా ఈ క్రాప్ నమోదు చేస్తున్నాం. పంటల నమోదుతో పాటు వీఏఏ, వీఆర్వోల అథెంటికేషన్, రైతులతో ఈ–కేవైసీ చేయించే ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. పంటల నమోదులో రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా మొదటి స్థానంలో ఉంది. ప్రతి రైతుకు కంప్యూటరైజ్డ్, మాన్యువల్ రసీదులు ఇస్తాం.

– వరలక్ష్మి, జిల్లావ్యవసాయాధికారి, కర్నూలు

పంటల నమోదుతో ఉపయోగాలు ఇవే..

☛ బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందవచ్చు.
☛ వైఎస్ఆర్ సున్నావడ్డీకి అర్హత సాధించవచ్చు.
☛ ఒక్క రూపాయి ప్రీమియం చెల్లించకుండా పంట బీమా పొందవచ్చు. 2022–23లో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన రైతులు రూ.500 కోట్ల పరిహారం పొందారు.
☛ ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట నష్టం జరిగినపుడు పెట్టుబడి రాయితీ(ఇన్‌పుట్ సబ్సిడీ) పొందవచ్చు.
☛ ధరలు పడిపోయినపుడు కనీస మద్దతు ధరతో వ్యవసాయ ఉత్పత్తులను రైతుభరోసా కేంద్రాల ద్వారా అమ్ముకోవచ్చు.

ప్రకృతి వ్యవసాయానికి పూర్వ వైభవం తెద్దాం

డోన్ రూరల్: ప్రకృతి వ్యవసాయానికి పూర్వ వైభవం తీసుకొద్దామని ప్రకృతి వ్యవసాయ రాయలసీమ జోన్ అధికారి చంద్రశేఖర్ సిబ్బందికి పిలుపు నిచ్చారు. పట్టణంలోని స్థానిక మండల మహిళ సమాఖ్య భవనంలో బుధవారం రైతులతో ప్రకృతి వ్యవసాయంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో పంటలు దెబ్బతినే పరిస్థితి ఉందన్నారు. ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొనేందుకు రైతులు ఒకే పంట కాకుండా పలు పంటల విధానాన్ని అవలంభించాలన్నారు. 15రోజులకు ఒకసారి జీవామృతాలను పిచికారీ చేస్తే మొక్క బెట్టను తట్టుకుంటుందన్నారు. సమావేశంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ నరేంద్రరెడ్డి, ఎస్ఆర్పీ లక్ష్మయ్య, డీపీఎం సలాం, ట్రైనర్ రంగారెడ్డి, సునందమాస్టర్, సొంటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్

క్లుప్తంగా

22న జిల్లా స్థాయి యువ సాంస్కృతిక పోటీలు

కర్నూలు(హాస్పిటల్): జిల్లా యువజన సంక్షేమ శాఖ/సెట్కూరు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువ సాంస్కృతిక పోటీలు ఈనెల 22వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ శాఖ అధికారి పీవీ రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 29వ ఏళ్లలోపు యువ కళాకారులకు స్థానిక సిల్వర్‌జూబ్లీ కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జానపదనృత్యాలు(గ్రూప్ 10 మందికి మించకుండా), జానపద నృత్యాలు(సోలో), జానపద గీతం (గ్రూపు), జానపద గీతాలు(సోలో), స్టోరీ రైటింగ్-కథారచన, పోస్టర్ మేకింగ్-చిత్రలేఖనం, ఫొటోగ్రఫి అంశాలలో పోటీలు జరుగుతాయన్నారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విజేతలను రాష్ట్రస్థాయికి, రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విజేతలను జాతీయ స్థాయికి పంపిస్తామన్నారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, పాల్గొన్న కళాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు వారి పేరు/బృందం పేరును వెబ్ లింక్ https://bit.ly/KURNOOLDYF2023 ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవడానికి వీలుగాని వారు నేరుగా పోటీలు జరిగే ప్రాంతానికి 22వ తేదీ ఉదయం 9 గంటల్లోపు వచ్చి నమోదు చేసుకోవచ్చన్నారు.

పీజీ సెమిస్టర్ పరీక్షలకు 23 మంది గైర్హాజరు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 23 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఆరు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుండగా 546 మంది గానూ 514 మంది విద్యార్థులు పరీక్ష రాశారని పేర్కొన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆయన తెలిపారు.

'గడప గడప' పనులకు నిధుల కొరత లేదు

శిరివెళ్ల: గడపగడపకు మన ప్రభుత్వం పనులకు నిధుల కొరత లేదని డీఎల్‌డీఏ జనార్దన్‌రావు తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో బుధవారం ఆయన శిరివెళ్లకు వచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నంద్యాల జిల్లాకు 1,455పనులు మంజూరయ్యాయన్నారు. అందులో 273 మున్సిపాలిటీ, 783 పంచాయతీ రాజ్, 298 ఆర్‌డబ్ల్యూఎస్, 61 పనులు విద్యుత్ సంస్థలకు చెందినవి అని పేర్కొన్నారు. మంజూరైన పనుల్లో 204 పూర్తికాగా వాటికి రూ. 5.9 కోట్లు ఖర్చు చేశామన్నారు. మరో 1,258 పనులు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. ఆయన వెంట ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఈఓఆర్డీ నాగేంద్ర ఉన్నారు.

నేడు కేంద్ర మంత్రి రాక

మంత్రాలయం: కేంద్ర కమ్యూనికేషన్ మంత్రి దేవ్ చౌహాన్ సింగ్ గురువారం మంత్రాలయం వస్తున్నట్లు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పురుషోత్తంరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నాభూమి- నా దేశం కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొననున్నట్లు తెలిపారు. కల్లుదేవకుంట గ్రామం వైపీఆర్ ఫాంహౌస్‌లో అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేసి అంజలి ఘటించనున్నారని వివరించారు. ఆయనతో పాటు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సావిత్రమ్మ, జిల్లా అధ్యక్షుడు కనిగిరి నీలకంఠ రానున్నరని ప్రకటనలో తెలిపారు.

సేవల్లో సర్వోత్తమం

- ఆంధ్ర తిలక్.. గాడిచెర్ల హరి సర్వోత్తమరావు
- వందేమాతర ఉద్యమంలో తొలి తెలుగు స్వాతంత్ర్య సమరయోధుడు
- ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో నంద్యాల నుంచి మొదటి ఎమ్మెల్యే
- గ్రంథాలయ పితామహుడిగా ఖ్యాతి
- నేడు గాడిచెర్ల 140వ జయంతి



కోవెలకుంట్లలో ఏర్పాటు చేసిన గాడిచెర్ల విగ్రహం



గాడిచెర్ల హరిసర్వోత్తమరావు(ఫైల్)

కోవెలకుంట్ల: బ్రిటీష్‌వారి కబంద హస్తాల నుంచి భారతదేశానికి స్వాతంత్రం సిద్ధింప చేసేందుకు పోరాటం చేసిన ఎందరో మహానుభావుల్లో జిల్లాకు చెందిన గాడిచెర్ల హరిసర్వోత్తమరావు ఒకరు. వందేమాత ఉద్యమంలో తొలి తెలుగు స్వాతంత్ర్య సమరయోధుడిగా, గ్రంథాలయాల అభివృద్ధికి విశిష్ట సేవలందించి గ్రంథాలయ పితామహుడిగా పేరు గడించారు. అంతేకాదు ఆంధ్రతిలక్‌గా జిల్లా ఖ్యాతిని దేశ నలుమూలలా చాటారు.

పేద కుటుంబంలో జన్మించిన గాడిచెర్ల అంచెలంచెలుగా ఎదిగి స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించటమే కాకుండా ఎన్నో రచనలు రచించారు. అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో నంద్యాల నుంచి ఎన్నికైన మొట్టమొదటి ఎమ్మెల్యేగా చరిత్రకెక్కారు. కర్నూలుకు చెందిన భాగీరథీబాయి, వెంకటరావు దంపతులకు 1883 సెప్టెంబర్ 14వ తేదీన గాడిచెర్ల హరిసర్వోత్తమరావు జన్మించారు. ఈయన విద్యాభ్యాసమంతా కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లా గుంతకల్లు, గుత్తిలో సాగింది. పేద కుటుంబం కావడంతో ఇంటి పనులు చేసి మరీ పాఠశాలకు వెళ్లి చదువుకునేవాడు. చిన్నతనం నుంచి గాడిచెర్ల చదువుతోపాటు ఆటాపాటల్లో ప్రావీణం పొందాడు. గాడిచెర్ల చేతిరాత అద్భుతంగా ఉండేది. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో కళ్లు చెదిరేలా రాసేవాడు. ఇతని దస్తూరిని గుర్తించి యూనివర్సిటీ బంగారు పతకం బహుకరించింది. థేయర్స్ రచించిన హిస్టరీఆఫ్ అబ్రహాం లింకన్ అనే గ్రంథాన్ని గాడిచెర్ల తెలుగులో అనువదించి విజ్ఞాన మండలి తరఫున మొదటి పుస్తకంగా ప్రచురించాడు. 1907వ సంవత్సరంలో ఎంఏ పూర్తి చేసి ఉపాధ్యాయ శిక్షణకు గాడిచెర్ల రాజమండ్రిలో ట్రైనింగ్ కళాశాలకు వెళ్లాడు. ఉదయం కళాశాలకు వెళుతూ రాత్రివేళల్లో నిరక్షరాస్య వయోజనులకోసం రాత్రి బడి ఏర్పాటు చేసిన ఘనత గాడిచెర్లదే. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్న బాలగంగాధర్ తిలక్, లాలాలజపతిరాయ్, బిపిన్‌చంద్రపాల్‌ను స్ఫూర్తిగా తీసుకోవడంతో గాడిచెర్లలో అంతర్గతంగా దాగి ఉన్న స్వాతంత్ర్య పిపాస, దేశభక్తి ఒక్కసారిగా పెల్లుబికాయి.

ఆంధ్ర తిలక్‌గా పేరు

వందేమాతర ఉద్యమంలో తొలి తెలుగు స్వాతంత్ర్య సమరయోధుడిగా గాడిచెర్ల రంగప్రవేశం చేసి అంకుఠిత దీక్షతో ఉద్యమించాడు. సాహిత్యం, వయోజన విద్య, గ్రంథాలయోద్యమం, పత్రికా రచన, సంఘ సంస్కరణ, సంఘీభావ ప్రకటనలు, సభలు, సమావేశాలతో గాడిచెర్ల జీవితం ముందుకు సాగింది. స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటీష్‌వారు బాలగంగాధర తిలక్‌ను అరెస్ట్ చేసిన రోజునే గాడిచెర్లను అరెస్టు చేసి వేలూరు సెంట్రల్ జైలుకు తరలించారు. దీంతో గాడిచెర్ల ఆంధ్ర తిలక్‌గా పిలువబడ్డాడు. ఈయన ఒకవైపు స్వాతంత్రోద్యమంలో పాల్గొంటూ మరోవైపు రచనలు, ఆకాశవాణి ప్రసంగాలు, సభలు, సమావేశాలు, సాంఘిక సంస్కరణలు, గ్రంథాలయాల ఏర్పాటు, గ్రంథాలను సమకూర్చడం, పత్రికలు నడపడం వంటి పనుల్లో తలమునకలై ఉండేవాడు. హోంరూల్ ఉద్యమంలో గాడిచెర్ల కీలకపాత్ర పోషించడమే కాకుండా బ్రిటీష్ వస్త్ర బహిష్కారం, జాతీయ విద్య, కల్లు, సారా పికెటింగ్‌లో ఈయన కనుసన్నల్లో నడిచేవి. చిత్తరంజన్‌దాస్, మోతీలాల్ నెహ్రూ స్థాపించిన స్వరాజ్య పార్టీని ఆంధ్రలో అభివృద్ధి చేసేందుకు గాడిచెర్ల కృషి చేశారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ప్రకాశం జిల్లా మార్కాపురం, గిద్దలూరు, బనగానపల్లె, కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ ప్రాంతాలతో ఉన్న నంద్యాల స్థానం నుంచి 1928వ సంవత్సరంలో పోటీ చేసి మొట్టమొదటి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అలాగే మద్రాసు కౌన్సిల్ సభ్యుడిగా ప్రజలకు సేవలందించారు.

ముఖ్య పట్టణాల్లో గాడిచెర్ల విగ్రహాలు

స్వాతంత్ర్య ఉద్యమంలో ఒకవైపు పాలు పంచుకుంటూ మరో వైపు గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తూ గ్రంథాలయ పితామహుడయ్యారు. ప్రజల కోసం ఎన్నో గ్రంథాలు, రచనలు రచించి ప్రపంచ విజ్ఞానాన్ని గ్రంథాలయాల ద్వారా పాఠకుల ముందుంచారు. అప్పటి గ్రంథాలయాలు దినదినాభివృద్ధి చెందుతూ విజ్ఞాన భాండాగారాలు నిలిచాయి. గ్రంథాలయాల అభివృద్ధి కోసం పాటుపడిన గాడిచెర్ల నిరుద్యోగ యువతకు ఆదర్శప్రాయుడయ్యారు. రాయలసీమ జిల్లాలోని కర్నూలు, వైఎస్సార్ జిల్లా గ్రంథాలయ సంస్థల ఆవరణాల్లో, కోవెలకుంట్లలో నంద్యాల ఎంపీ బ్రోచాబ్రహ్మానంద రెడ్డి సహకారంతో గాడిచెర్ల విగ్రహాలు ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లా వెలుగోడు గ్రంథాలయ ఆవరణలో గత ఏడాది గాడిచెర్ల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

ముందస్తు రబీకి శనగ విత్తనాలు సిద్ధం

- 15 నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
- ధర, సబ్సిడీ వివరాలను త్వరలోనే ప్రకటిస్తాం
- ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్‌బాబు



కల్లూరు మండలం ఏ.గోకులపాడులో రైతులతో మాట్లాడుతున్న ఏపీసీడ్స్ ఎండీ శేఖర్‌బాబు, డీఏవో వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): ముందస్తు రబీకి అవసరమైన శనగ విత్తనాలను సిద్ధంగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ(ఏపీసీడ్స్) మేనేజింగ్ డైరెక్టర్ జి.శేఖర్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన కల్లూరు మండలం ఏ.గోకులపాడు, కోడుమూరులో పర్యటించి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. వర్షాభావం కారణంగా ఖరీఫ్‌లో విత్తనం పడని భూములను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో ఖరీఫ్ పంటల సరళిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో పత్తి, వేరుశనగ, పత్తి, ఆముదం తదితర పంటలు 3.80 లక్షల హెక్టార్లలో సాగు కావాల్సి ఉందని, అయితే వర్షాలు ఆలస్యం కావడంతో 2.78 లక్షల హెక్టార్లలో మాత్రమే సాగయ్యాయని తెలిపారు. కొన్ని చోట్ల పంటల్లో ఎదుగుదల లేకపోవడం వల్ల తీసేసినట్లు స్పష్టమైందని పేర్కొన్నారు. మొత్తంగా నల్లరేగడి నేలలు 92 వేల హెక్టార్లలో ముందస్తు రబీకి రైతులు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. ఇందుకు 40 వేల క్వింటాళ్ల శనగ విత్తనాలు అవసరమవుతాయని, సబ్సిడీపై పంపిణీ చేసేందుకు ఏపీ సీడ్స్ సిద్ధంగా ఉందని తెలిపారు. ధరలు, సబ్సిడీలను ప్రభుత్వం రెండు, మూడు రోజుల్లో ఖరారు చేస్తుందని స్పష్టం చేశారు. శనగ విత్తనాల కోసం ఈ నెల 15 నుంచి డి-క్రిషి యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రక్రియను ప్రారంభిస్తున్నామన్నారు. ఆర్‌బీకే స్థాయిలోనే శనగ విత్తనాల పంపిణీ జరుగుతుందని తెలిపారు. ముందస్తుగా వేసే శనగ పంట డిసెంబరుకు పూర్తి అవుతుందని, భూమిలో తేమ, ఒకటి, రెండు నీటి తడులకు అవకాశం ఉంటే జనవరి నుంచి మూడో పంట కింద చిరుధాన్యాల సాగుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఏపీ సీడ్స్‌లో శనగతో పాటు వేరుశనగ, చిరుధాన్యాల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.

అన్ని రకాల విత్తనాలు సిద్ధం

ముందస్తు రబీ, రబీ కోసం అవసరమైన అన్ని రకాల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏపీ సీడ్స్ ఎండీ తెలిపారు. రాష్ట్రం మొత్తానికి 3.40 లక్షల క్వింటాళ్ల శనగ, 35 వేల క్వింటాళ్ల వేరుశనగ అవసరముందని ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. కర్నూలు జిల్లాకు 40 వేల క్వింటాళ్ల శనగ, 7,500 క్వింటాళ్ల వేరు శనగ అవసరముందని పేర్కొన్నారు. శనగ విత్తనాలను ముందస్తు రబీ కోసం ఈ నెల 15 నుంచి పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, వేరుశనగ అక్టోబరు మొదటి వారంలో ఇస్తామని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన జొన్న, కొర్ర, ఉలువ తదతర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

ఎకరాకు 40 కిలోల ప్రకారం ఇవ్వండి

ఈ ఏడాది వర్షాభావం వల్ల ఖరీఫ్‌లో పంటలు వేసుకోలేకపోయామని, ముందస్తు రబీ కింద శనగ సాగుకు వెంటనే విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేయాలని రైతులు ఏపీ సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్‌బాబును కోరారు. కల్లూరు మండలం ఏ.గోకులపాడు, కోడుమూరుల్లో పలువురు రైతులు ఆయనతో మాట్లాడారు. ఎకరాకు సబ్సిడీపై 25 కిలోల ప్రకారం ఇస్తున్నారని, 40 కిలోలు ఇచ్చే విధంగా చూడాలని కోరారు. సబ్సిడీని 40 శాతం నుంచి 80 శాతానికి పెంచాలని, ఈ సారి నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో సబ్సిడీ విత్తనాలను 10 ఎకరాల వరకు పంపిణీ చేయాలని కోరారు. ఏపీ సీడ్స్ ఎండీ స్పందిస్తూ.. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకపోతామని, రైతులకు అన్ని విధాలా మేలు చేయడానికి ప్రయతిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, కల్లూరు, కోడుమూరు ఏవోలు శ్రీనివాస రెడ్డి, రవిప్రకాశ్, ఏపీసీడ్స్ మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.

శిబిరం చిరునామా

కర్నూలులో..
మాంటిస్సోరి స్కూల్, ఏ.క్యాంప్, కర్నూలు
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 97053 47392

నంద్యాలలో..
శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఎన్‌జీఓ కాలనీ, లలితా నగర్, నంద్యాల
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 99122 20581

ఏసీబీకి చిక్కిన జలకనూరు వీఆర్వో

- పొలం ఆన్‌లైన్‌కు లంచం డిమాండ్
- వలపన్ని పట్టుకున్న ఏసీబీ అధికారులు



ఏసీబీ అధికారులకు పట్టుబడిన వీఆర్వో వెంకటరమణారెడ్డి

మిడుతూరు: పొలం ఆన్‌లైన్‌కు లంచం తీసుకుంటూ మిడుతూరు మండలం జలకనూరు గ్రామ రెవెన్యూ అధికారి వెంకటరమణారెడ్డి ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి తెలిపిన వివరాల మేరకు.. జలకనూరు గ్రామానికి చెందిన వెంకటరమణయ్య అనే రైతు తన భూమిని ముగ్గురు కూతుర్ల పేరిట దాన విక్రయం చేశాడు. తర్వాత వారి పేర్ల మీద పొలాన్ని ఆన్‌లైన్‌లో ఎక్కించాల్సిందిగా వీఆర్వో వెంకట రమణారెడ్డిని సంప్రదించాడు. ఇందుకు అతను రూ. 10 వేలు లంచం డిమాండ్ చేయగా రూ.3వేలు అందజేశాడు. తర్వాత మిగిలిన రూ. 7 వేలు కూడా ఇవ్వాలని లేకపోతే చేయనని తేల్చిచెప్పాడు. అంత సొమ్ము ఇచ్చుకోలేని రమణయ్య ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు బుధవారం రూ. 7 వేలు మిడుతూరు బస్టాండు సమీపంలోని గదిలో వెంకటరమణారెడ్డికి ఇస్తుండగా ఏసీబీ అధికారులు వల పన్నీ పట్టుకున్నారు. ఈ దాడుల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్ తేజేశ్వర్ రావు, వెంకటకృష్ణారెడ్డి, ఇంతియాజ్, అహమ్మద్, కృష్ణయ్య, వంశీనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు

ప్రభుత్వ ఉద్యోగులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కర్నూలు ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి హెచ్చరించారు. జలకనూరు గ్రామ రెవెన్యూ అధికారి అంచం తీసుకుంటూ పట్టుబడిన అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే 14400 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి చెప్పాలని సూచించారు. సమాచారమందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

రోడ్ల నిర్మాణానికి టెండర్ల ఆమోదం

కర్నూలు (న్యూసిటీ): ఉమ్మడి కర్నూలులో జిల్లాలో ప్రాధాన్యత గల రహదారుల నిర్మాణం, మరమ్మతుల కోసం రూ.27.75 కోట్లతో ప్రభుత్వం టెండర్లకు ఆమోదం తెలిపిందని ఆర్అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు బుధవారం విలేకరులకు తెలిపారు. కర్నూలు జిల్లాలో పెద్దకడబూరు- దొడ్డిమేకల- మురవణి, ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డు, ఆదోని నుంచి పెద్ద పెండేకల్ వయా చిన్న పెండేకల్ రోడ్డు, ఆదోని - సిరుగుప్ప రోడ్డు, కపటి- పెద్దతుంబళం వయా పెసలదిన్నె-మంత్రికి- దొడ్డనగేరి-నౌసేకల్ రోడ్డు, ఎమ్మిగనూరు-మాలపల్లి- కోసిగి రోడ్డు, కోసిగి- ఉరుకుంద వయా వందగల్లు- జమ్ములదిన్నె రోడ్డు నిర్మాణానికి టెండర్లను ప్రభుత్వం ఆమోదించిందన్నారు. నంద్యాల జిల్లాలోని లింగాల- నంద్యాల రోడ్డు నుంచి కానాల- దీబగుంట్ల వరకు అలాగే లింగాల - నంద్యాల రహదారి నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లను ఆమోదించిందని ఎస్‌ఈ వెల్లడించారు. త్వరలో ఈ రహదారుల పనులు జరుగుతాయని తెలిపారు.

విద్యుత్ శాఖ టెక్నికల్ ఈఈగా ఓబులేసు



కర్నూలు కల్చరల్: దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) కర్నూలు సర్కిల్ టెక్నికల్ ఈఈగా ఓబులేసు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డీఈఈగా ఉన్న ఆయన ఈఈగా పదోన్నతి పొంది టెక్నికల్ ఈఈగా నియమితులయ్యారు. 1997లో ట్రాన్స్‌కో ఏఈగా ఉద్యోగంలో చేరారు. 2002లో ఎస్పీడీసీఎల్‌కు కేటాయించారు. 2005లో ఏడీఈగా పదోన్నతి పొంది కర్నూలు స్టోర్స్ విభాగానికి బదిలీ అయ్యారు. వివిధ విభాగాల్లో విధులు నిర్వహించిన ఈయన ఈఈగా పోదన్నతి పొందారు. ఈఈగా బాధ్యతలు స్వీకరించిన ఓబులేసుకు పలువురు డీఈఈ, ఏఈలు శుభాకాంక్షలు తెలిపారు.

బీఎస్సీ నర్సింగ్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌లో బీఎస్సీ నర్సింగ్ కోర్సు అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ ఇన్‌స్టిట్యూషన్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పెరుగు విజయవర్ధన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ తేదీని 12వ తేదీ నుంచి 18వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు పొడిగించారన్నారు. గతంలో మాదిరి కాకుండా ప్రస్తుతం ప్రతి అభ్యర్థి ఏపీఈఏపీసీఈటీ-2013లో క్వాలిఫై అయిన ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. విద్యార్థులు https://ugnursing.ysruhs.com ద్వారా ఆన్‌లైన్ అప్లికేషన్ పొందవచ్చన్నారు.

అక్రమ లేఅవుట్లపై కొరడా

- 20.85ఎకరాల్లో 8 అనధికార లేఅవుట్లను తొలగించిన అధికారులు



జేసీబీతో రహదారిని చదును చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): నంద్యాల మండల పరిసర ప్రాంతాల్లోని అక్రమ లేఅవుట్లపై కర్నూలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా) అధికారులు కొరడా ఝులిపించారు. కానాల, అయ్యలూరు, చాబోలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన అనధికార లేఅవుట్లను గుర్తించి సంబంధిత యజమానులకు నోటీసులు ఇచ్చారు. అయితే, స్పందన రాకపోవడంతో బుధవారం ఆ మూడు గ్రామాల్లోని 8 లేఅవుట్లకు సంబంధించిన 20.85 ఎకరాల లేఅవుట్‌ను కుడా వైస్ చైర్మన్ ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో తొలగించారు. ఆయన మాట్లాడుతూ కానాలలోని సర్వే నంబరు 1052, 1053 లోని 8 ఎకరాలు, అయ్యలూరులో సర్వే నంబరు 470 లోని 1.50 ఎకరాలు, చాబోలు గ్రామం 245/3లో 3.75 ఎకరాలు, 245/2సిలో 1.28 ఎకరాలు, 246/3ఎ లో 2 ఎకరాలు, 2.53 ఎకరాలు, 29 లో 1.00 ఎకరా, 102 సర్వే నంబరులో 0.79 ఎకరాలకు సంబంధించిన వాటిలో ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్లను తొలగించామని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతి పొంది అభివృద్ధి చేసిన నివాస ప్లాట్లను మాత్రమే వినియోగదారులు కొనుగోలు చేయాలని సూచించారు. కుడా ప్లానింగ్ అధికారులు సంధ్య, విజయ భాస్కర్,డీఐపీఓ రాంబాబు, ఈఓఆర్డీ మహీధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్‌లో పట్టుబడిన వారికి భారీ జరిమానా

కర్నూలు: లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తూ స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన మైనర్ల తల్లిదండ్రులకు రవాణా శాఖ అధికారులు భారీ జరిమానా విధించారు. కర్నూలు నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 13వ తేదీన స్పెషల్ డ్రైవ్‌లో 20 మంది మైనర్లు వాహనాలు తోలుతూ పట్టుబడగా వారి వాహనాలను రవాణా శాఖ అధికారులకు అప్పగించారు. ఒక్కొక్క వాహనానికి రూ.11 వేల నుంచి రూ.13,500 దాకా జరిమానా విధించారు.

మరో 37 వాహనాలు రవాణా శాఖకు అప్పగింత...

స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం నగరంలోని సి.క్యాంప్, రాజ్‌విహార్, ఓల్డ్ ఈద్గా, ఫైవ్ రోడ్ జంక్షన్, సెయింట్ జోసెఫ్ కళాశాల సెంటర్లలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనాలపై త్రిబుల్ రైడింగ్ చేస్తున్న 37 మంది మైనర్లను అదుపులోకి తీసుకుని వారి వాహనాలను సీజ్ చేసి రవాణా శాఖ అధికారులకు అప్పగించారు. గత ఆరు మాసాలుగా మైనర్ డ్రైవింగ్‌పై నిరంతరం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నప్పటికీ, మైనర్లు, వారి తల్లిదండ్రుల్లో మార్పు రాకపోవడంతో తదుపరి చర్యల నిమిత్తం పట్టుబడిన వాహనాలను రవాణా శాఖ అధికారులకు అప్పగిస్తున్నట్లు ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం తెలిపారు.

యువకుడి బలవన్మరణం



మృతుడు బైరాపురం గోపాల్ (ఫైల్)

కొత్తపల్లి: జీవితంపై విరక్తి చెంది బండినాయుని పాలెంలో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బండినాయుని పాలెంకు చెందిన బైరాపురం గోపాల్(23) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. వారం క్రితం తన పెద్దనాన్న చనిపోతే స్వగ్రామానికి వచ్చాడు. ఈ సందర్భంగా తండ్రి రామచంద్రుడు వ్యవసాయం, వివిధ అవసరాలకు చేసిన అప్పు గురించి కుమారుడికి చెప్పాడు. అప్పటికే ప్రేమ వికటించి బాధలో ఉన్న గోపాల్‌కు తండ్రి అప్పుల గురించి తెలియడంతో వాటిని ఎలా తీర్చాలనే బెంగ పట్టుకుంది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా మంగళవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి తండ్రి బైరాపురం రామచంద్రుడు ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కర్నూలు(న్యూటౌన్) : గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రామగిడ్డయ్య వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కర్నూలు మండలం ఇ.తాండ్రపాడు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న సేవలపై డాక్టర్ ముఖ్తార్ పాషాను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. అనంతరం ఆర్.కొంతలపాడు గ్రామంలో జరుగుతున్న వైద్యశిబిరాన్ని తనిఖీ చేశారు.